క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేడికొండూరు: మండలంలోని 14 గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి బి.నాగరాజ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లేన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

30న సీతారామ మందిర ప్రతిష్టా మహోత్సవం

తూములూరు(కొల్లిపర): మండల పరిధిలోని తూములూరు గ్రామం ఆయోధ్యనగర్, ఎస్టీ కాలనీలో ఈ నెల 30న ఉదయం 11.02 గంటలకు సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి వార్ల నూతన బింబ ప్రతిష్టా మహోత్సవం జ్యోతిష–వాస్తు పండితులు నారాయణం రాజ గోపాలాచార్యులు చేతులమీదుగా వేద మంత్రాల నడుమ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు సోమవారం మాట్లాడుతూ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా 28న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు మంగళవాద్యం, ప్రార్థన, ఆచార్యవరణం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మేధిని పూజ, అంకురార్పణ, కలశ స్థాపన, 29న ఉదయం 7 గంటల నుంచి మంగళవాద్యం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, అగ్ని స్థాపన, కలశారాధన, ఉక్త హోమం, అక్షిమోచనం, పంచగవ్య, క్షీర, జలాధివాసాలు, సాయంత్రం 4 గంటలకు గ్రామోత్సవం, 7 గంటలకు మంగళవాద్యం, సంకల్పం, అగ్ని ప్రణయనం, సర్వదైవత్వం, శయనాధివాసం నిర్వహిస్తారన్నారు. మూడవ రోజు 30న ఉదయం 7 గంటలకు మంగళవాద్యం,"సుసంకల్పం, అగ్నిప్రణయనం, పుణ్యాహవచనం, కలశారాధన, విశేష హోమాలు, 11.02 గంటలకు స్వామి వారి ప్రతిష్ట అనంతరం శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేసి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావూరి పున్నయ్య, రావూరి వెంకటేశ్వర్లు, రెడ్డి వెంకటప్పారెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం


తెనాలిరూరల్: అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని అంగలకుదురు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాణవత్ సీత వంట చేస్తుండగా గ్యాస్ లీక్ అయి మంటలు వ్యాపించాయి. మంటల కారణంగా పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. సీత కుటుంబం కట్టుబట్టలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి బియ్యం, నిత్యావసరాలు, రూ.ఐదు వేల నగదు అందించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

మదర్ థెరీసా సేవలు అపారం



తెనాలి: పట్టణ దైవజనుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బోసురోడ్డులోని కార్యాలయంలో మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. మదర్ థెరిసా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుష్టు రోగులతో సహా దీన జనులకు ఆమె చేసిన సేవలు అపారమైనవని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా నగరి దైవజనుడు, చిన్నపిల్లలు, వృద్ధులు, అనాథలకు ఆహార వసతి సదుపాయాలను కల్పిస్తున్న సంఘ సేవకుడు జి.ప్యారడైజ్‌ను ఘనంగా సత్కరించారు. బిషప్ జె.ప్రభుదాస్ బ్రదర్ ఆనందన్న, రెవరెండ్ పి.శామ్యూల్, పాస్టర్ సీహెచ్ ఎబినేజర్, పాస్టర్ జి.దానియేలురాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని బొందలపాటి మార్కెటింగ్ ప్రైవేటు లిమిటెడ్ 34వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం 74 మంది విద్యార్థులకు రూ.2,100 చొప్పున ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. గత టెన్త్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి, ప్రస్తుతం ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సాహంగా ఉపకార వేతనాలు పంపిణీ చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బొందపాటి వేంకట ఫణికుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ మోగ్రా, రవితేజ, ఉమాదేవి, రామ్‌ప్రసాద్, రాజు, శివనాగేశ్వరరావు, సంస్థ మేనేజర్ వేల్పూరి మారుతిరాము పాల్గొన్నారు.

ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి



కోల్‌కతా ఘటన వైద్య విద్యార్థుల్లో ఆందోళన కలుగజేసింది. సుప్రీంకోర్టు సుమోటాగా చర్యలు చేపట్టే వరకు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గం. దీంతో విద్యార్థులతో పాటు తల్లితండ్రుల్లో ఆందోళన కలగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

– డాక్టర్ ఎ.శివనాగేంద్రరెడ్డి, ఎన్ఆర్ఐ, మంగళగిరి



పునరావృతం కాకుండా చూడాలి

ఎంతో దూరం వచ్చి తల్లితండ్రులకు దూరంగా చదువుకునే వారికి కోల్‌కతా లాంటి ఘటనలు ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. తల్లితండ్రుల ఆశలు నెరవేర్చి, సమాజానికి వైద్య సేవలందించాలని కష్టపడి చదువుతున్నాం. ఇలాంటి ఘటనలు పునావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ప్రియాంక, మెడికల్ ఆఫీసర్, పీహెచ్ఎస్, మార్కేండేయ కాలనీ, మంగళగిరి



వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

ఫిరంగిపురం: కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫిరంగిపురం వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు విశేష పూజలు చేశారు. రామాలయంలోని గీతామందిరంలో అర్చకులు రాజేంద్ర శర్మ స్వామికి పూజలు చేశారు. గీతా భజన మండలి ఆధ్వర్యంలో పారాయణ చేశారు. 113 తాళ్లూరులోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో అష్టోత్తర, సహస్ర నామ పూజలను అర్చకులు ప్రసన్నమూర్తి నిర్వహించారు.

తాడేపల్లిరూరల్: కార్పొరేషన్ పరిధిలోని యాదవ బజార్‌లో శ్రీకృష్ణ మందిరం వద్ద సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డేవిడ్ రాజు, సింకా గంగాధర్, దొంతిరెడ్డి వేమారెడ్డి, వెంకట రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ కొలనుకొండలోని హరేకృష్ణ గోకుల క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గోకుల క్షేత్రం అధ్యక్షులు వంశధార దశ మాట్లాడుతూ శ్రీకృష్ణుడికి మహా అభిషేకం, మంగళ హారతి, 108 పవిత్ర జల కలశాలతో, పండ్ల రసాలు, పంచామృతం, పంచగవ్యాలతో, వివిధ పుష్పాలతో మహా అభిషేకం నిర్వహించామని తెలిపారు. బృందావనమ్ నుంచి వచ్చిన లడ్డు గోపాలునికి మృదువైన ఉయ్యాలలో సేవ,



విశేష అలంకారంలో వేణుగోపాల స్వామి

సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి, భరతనాట్యంలో ప్రఖ్యాత కళాకారులు పాల్గొన్నారన్నారు. కృష్ణుడు ఎవరు అనే అంశంపై 10 ప్రశ్నలతో పరీక్ష తదితర కార్యక్రమాలు నిర్వహించామని, ఈ వేడుకలలో వేలాది మంది భక్తులు కృష్ణ పరమాత్ముడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

తాడేపల్లిరూరల్: అంగరంగ వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం నిర్వహించారు. తాడేపల్లి యాదవపాలెంలో కృష్ణ మందిరంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ముఖ్య అతిథిగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే ముద్రబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ మంగళగిరి సమన్వయ కర్త నందం అబద్దయ్య, ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సుందరరావు, పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు, సీపీఎం నాయకులు వెంకటరెడ్డి, శివశంకరరావు, సిసిఐ నాయకులు పాల్గొన్నారు. సాయంత్రం ఉట్టి, శ్రీపుష్పయాగం, అష్టోత్తర శతనామావళి, పవళింపు సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.



మహానాడులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో శ్రీకృష్ణ సేవా సమితి సభ్యులు



అన్న ప్రసాదాల వద్ద జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు వెంకటాచార్యులు



పూజలో సోమిరెడ్డి

- మహానాడు 14వ రోడ్డులో శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కేతుబోయిన అన్నమయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, రమణయ్య పాల్గొన్నారు.
- ఉండవల్లి సెంటర్‌లో శ్రీకృష్ణ యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారీ అన్నదానం చేశారు. ఉట్టి కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.
- విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో బోసు బొమ్మ సెంటర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. విజేతలకు విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో బాలోత్సవం నిర్వాహకులు గాదె సుబ్బారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.
- దుగ్గిరాలలోని యాదవపాలెం, రైలుపేట, శివాలయం సెంటర్ వద్ద శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు కేక్ కటింగ్ నిర్వహించి, పుస్తకాలు పంపిణీ చేశారు. శ్రీకృష్ణ ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.



హరేకృష్ణ గోకుల క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



మహానాడులో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు



తాడేపల్లిలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

మదర్ థెరీసా అడుగు జాడల్లో నడవాలి



తాడేపల్లిరూరల్: మానవతా వాది, భారత రత్న, నోబెల్ శాంతి గ్రహీత మదర్ థెరిస్సా జయంతిని సోమవారం దుగ్గిరాలలో మదర్ థెరీసా సాంస్కృతిక సేవా సమితి, పద్మభూషణ్ గుర్రం జాషువా కళాస్మారక పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కళా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దేటి యోహాన్, గౌరవ సలహాదారు షేక్ సుభాని మాట్లాడుతూ ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న..అని చేతల్లో మదర్ థెరిస్సా చూపించారన్నారు. పేదరికం, ఆకలి, దుస్థితి వంటివి దేశానికి ప్రమాదకరమని భావించి నిర్మల్ హృదయ్ ఆశ్రమాలను ఏర్పాటు చేసి, ఎనలేని సేవలను అందించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బొక్కినెల సాంబయ్య, పులివర్తి సుమన్, పులివర్తి కోటేశ్వరరావు, కొలకలూరి శ్యామ్‌బాబు, ఎలమాటి ఎర్రబ్బాయి, చిలువూరు రమేష్ పాల్గొన్నారు.

దివ్యాంగ జంటకు వివాహం

నెహ్రూనగర్: దివ్యాంగుల వివాహ ఇన్ఫో సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ భవన్‌లో దివ్యాంగ జంటకు వివాహం జరిపించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నాగమణి, చీరాల చెందిన రమేష్ బాబుకు బంధుమిత్రుల మధ్య వివాహం జరిపించారు. సందర్భంగా సొసైటీ అధ్యక్షులు నాగశ్రీ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగ జంటలకు వివాహాలు జరిపిస్తున్నామని, ఇప్పటి వరకు 181 దివ్యాంగ జంటలకు వివాహాలు జరిపించామన్నారు. వివాహం జరిపించవలసిన వారు తమను 85558 10100 కు సంప్రదించవచ్చు అన్నారు.

ఏకలవ్యుడు స్ఫూర్తి ప్రదాత

ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా

తాడేపల్లిరూరల్ : గురువు లేకపోయినా విలువిద్యలో రాణించిన ఏకలవ్యుడు స్ఫూర్తి ప్రదాత అని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఏకలవ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి 23 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం గిరిజన నాయకులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కమిషర్ ఏకలవ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, మంచి సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమన్నారు. ద్రోణాచార్యుల వద్ద నిరాకరింపబడ్డ ఏకలవ్యుడు పట్టువదలకుండా ధనుర్విద్యను.. ద్రోణాచార్యుడి ప్రతిమను నెలకొల్పి సాధనతో సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్టా వెంకటేశ్వర్లు, బాబు, నాగేశ్వరరావు, రాఘవులు, కన్నారావు, శివశంకరరావు, సుబ్బారావు, కళ్యాణ్, సాంబయ్య, కళ్యాణ్, ప్రసాద్, శ్రీను, జోజి, రజనీకాంత్ పాల్గొన్నారు.



ఏకలవ్యుడు, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించిన కమిషనర్ , నాయకులు

ముమ్మరంగా మినుము కోతలు



హార్వెస్టర్ యంత్రంతో మినుము కోత



తూర్పారబడుతున్న రైతులు

తాడికొండ: మినుము సాగు చేసిన రైతులు..వర్షాలు తగ్గుముఖం పట్టడంతో హార్వెస్టర్‌తో పంట కోత మొదలు పెట్టారు. ఎకరాకు గతంలో రూ.1,800 నుంచి రూ.2వేల వరకు వరకు ఉండే యంత్రం అద్దె ఇప్పుడు గంటకు రూ.2,500గా ఉంది. వర్షం పడితే పంట ఇంటికి చేరడం కష్టతరమయ్యే పరిస్థితి ఉన్న నేపథ్యంలో రైతులు హార్వెస్టర్ యంత్రాలను ఆశ్రయించి, త్వరితగతిన పంట ఉత్పత్తులు ఇంటికి చేర్చుకుంటున్నారు. తాడికొండ మండల పరిధిలో దాదాపు 15 యంత్రాలు కోత, నూర్పిడి చేస్తున్నాయి. దీనికి తోడు మినుము క్వింటా రూ.8,600 వరకు నాణ్యతను బట్టి బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. సగటున ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుండటంతో.. లాభాలు లేకున్నా పెట్టుబడి, ఖర్చులకు ఇబ్బంది లేకుండా వస్తుందని రైతులు చెబుతున్నారు.

వినాయక మండపాలకు నిబంధనలు తప్పనిసరి

డీఎస్పీ జనార్దనరావు

తెనాలిరూరల్: వినాయక చవితి పండగ సందర్భంగా పందిళ్లు/మండపాలు ఏర్పాటు చేసుకోదలచిన వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ బి.జనార్దనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంటపాలు ఏర్పాటు చేసే వారికి నియమ నిబంధనలు ఉన్నాయని, వాటిని కచ్చితంగా పాటించాల్సిందేనన్నారు. వినాయక చవితి పందిళ్లు/మంటపాలు ఏర్పాటు చేసుకోవడానికి ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలిపి, వారి గుర్తింపు కార్డు నకలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

- ప్రైవేట్/ ప్రభుత్వ స్థలాల్లో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే వారు ప్రైవేట్ స్థలమైతే యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ/మున్సిపాలిటీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతి తీసుకొని మంటపాల వద్ద ఇసుక, నీళ్లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.
- విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం తో పాటు విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.



- ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ బాక్స్‌లను ఉపయోగించాలని, భద్రత కోసం రాత్రి సమయాల్లో మంటపాల వద్ద కమిటీ ప్రతినిధులు కాపలా ఉండాలన్నారు.
- రోడ్డుపైన వినాయక విగ్రహాలు పెట్టకూడదని, బ్యానర్లు, ఫ్లెక్సీలు ప్రజల రాకపోకలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఉంచకూడదని చెప్పారు. ఊరేగింపు సమయంలో బాణసంచా కాల్చకూడదని, అనుచిత, అసభ్య నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేయకూడదన్నారు. నిర్దేశించిన నిమజ్జన మార్గంలోనే వెళ్లాలని, శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ప్రజలందరూ వినాయక చవితి పండగను జరుపుకోవాలని డీఎస్పీ సూచించారు.

నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి లేదు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా ఉదయం సమయాల్లో నగరంలోకి భారీ వాహనాలు ప్రవేశిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని బెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస రావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు చుట్టుగుంట వైపు నుంచి ఎస్వీఎన్ కాలనీ, జేకేసీ కళాశాల, శ్యామలా నగర్ రహదారుల వైపు నుంచి ట్రాక్టర్లు, లారీలకు ఎటువంటి ప్రవేశం లేదని తెలిపారు. నో ఎంట్రీ సమయంలో నగరంలోకి భారీ వాహనాలు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నిబంధనలకను గుణంగా లారీ, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు వ్యవహరించాలని సూచించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

పట్నంబజారు: గంజాయి నిల్వలు కలిగి ఉండి, విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. వసంతరాయపురానికి చెందిన మైనంపాటి వెంకటేశ్వర్లు, వెంకటశివరామకృష్ణ గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాడిచేశారు. వసంతరాయపురంలోని వారి నివాసాల్లో రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

జిల్లా వినియోగదారుల పరిరక్షణ సంస్థ గౌరవ సభ్యునిగా పొత్తూరి రంగారావు

నగరంపాలెం: జిల్లా వినియోగదారుల పరిరక్షణ సంస్థ గౌరవ సభ్యుడిగా కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు నియమితులయ్యారు. అరండల్‌పేట ఆరో వీధిలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రంగారావు మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

నగరంపాలెం: కృష్ణాష్టమి సందర్భంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో విశ్వ శాంతిని కాంక్షిస్తూ చండీహోమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీ,, ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మేకా దేవేంద్ర కుటుంబ సభ్యులతో తొమ్మిది మంది వేద పండితుల నిర్వహణలో గణపతికి, శివ లింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



'కేఎల్‌యూ' ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో సోమవారం యూనివర్శిటీ దత్తత గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి. చక్రవర్తి మాట్లాడుతూ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో విజయవాడ మిత్రా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, అమరావతి నేత్ర వైద్యశాల, వెంకటరమణ దంత వైద్యశాల వైద్యులు ఉచితంగా రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, నేత్ర, దంత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సుప్రియ మాట్లాడుతూ.. దోమ తెరలను వాడాలని, శుభ్రమైన నీరు, పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. మూడు రోజుల కంటే ఎక్కువగా జ్వరం ఉంటే సమీప ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్య శిబిరం నిర్వహణకు సహకారం అందించిన వడ్డేశ్వరం గ్రామ పెద్ద కత్తిక మల్లికార్జునరావుకు ధన్యవాదాలు తెలిపారు. శిబిరంలో పాల్గొన్న వారిని వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగాం కో–ఆర్డినేటర్ పి. శ్రీకాంత్ రెడ్డి అభినందించారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

శిఖర ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం

తెనాలి: తెనాలిలో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వైకుంఠపురం దేవస్థానంలో కళాన్యాస పూర్వక శిఖర ప్రతిష్టా మహాసంప్రోక్షణ ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు జరగనున్న వేడుకల్లో భాగంగా తొలి రోజు విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి భగవత్ ప్రార్థన, విష్వక్సేనారాధన, పుణ్యాహవచన, అగ్నిప్రతిష్టాపన, అకల్మష హోమం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల గర్భాలయాలు, జీవధ్వజం, నూతన శిఖరాలు, నూతన ఉత్సవ విగ్రహాలకు, ప్రసన్నాంజనేయస్వామి శిలా విగ్రహానికి వాస్తు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల కళాపకర్షణ, నివేదన, నీరాజన, ఆశీర్వచనం, తీర్థ ప్రసాదగోష్టి, తీర్థప్రసాద వితరణ చేశారు. మూడో రోజైన 28వ తేదీ నుంచి స్వామి, అమ్మవార్ల గర్భాలయాల్లో స్వామి, అమ్మవార్లకు పూజా కైంకర్యాలు యథావిధిగా కొనసాగనున్నాయి. దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. ఉత్సవాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు కురగంటి సునీత–రవింకర్, బొద్దులూరి సరస్వతి–నాగేశ్వరరావు, ముంతా ప్రసాద్, దేవరకొండ వెంకటరమణ–శంకరరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడు అళహరి రవికుమార్ పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.తిమ్మానాయుడు పర్యవేక్షించారు.



ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు